"శ్రీమతి గోమతికి.
నీవు నాభార్యగాచేరి ఈ రోజుతో రెండేళ్ళు నిండిందని నీకు గుర్తుందనుకుంటాను. మొన్న మధ్యాహ్నం నువ్వు నా అనుమతిలేకుండా భార్య డ్యూటీ నుండి విరమించు కొన్నట్లు అబ్‌స్కాండ్ అయిన సందర్భంగా నీపై దిగువ తెల్పబడిన ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తున్నాను. వీటికి 24 గం॥ లోపుగా సక్రమమైన సంజాయిషీ యిచ్చుకోని పక్షంలో నిన్ను భార్యోద్యోగం నుంచి వూస్టుచేయవలసి వస్తుందని చెబుతున్నాను.

1. పై అధికారుల అనుమతి లేకుండా, ఓరల్‌గా పుట్టింటిఅడ్రసుతెలుపుతూ, కుటుంబ విధుల నిర్వహణలో నిర్లక్ష్యంచూపుతూ పారిపోవటం,

2. ఈ రెండేళ్ళలో నెలపొడుగునా, ముఖ్యంగా నెలాఖరు రోజుల్లోకూడా, జేబులు తడుముతూ, నీ పతిని పరపతికోసం రోడ్లెంబడి తిరిగేటట్లు చేయటం,

3. మా బంధువులతాలూకు పెళ్ళిశుభలేఖలు గట్రా వస్తే అవి దాచిపెట్టి, నేను అవి మిస్ అయేటట్లు చేసి మీవాళ్ళవి మాత్రం ప్రకటించి, నా కధిక వ్యయాన్ని ప్రయాసను కలిగించటం,

4. ఉద్యోగంలో చేరినప్పటినుండీ పోరు పెడుతున్నా, కుటుంబ నియంత్రణ పద్ధతుల కనుకూలంగాక, నీతో 'పని' చేయాలంటే గుండె దడనుకలిగించటం.

5. నెలపొడుగునా మూడురోజులు నిర్బంధంగా సెలవు తీసుకుంటూ, నాకు వంటింటి కార్యభారాన్ని పెంచి, పడకటింటి మాధుర్యాన్ని తుంచటం,

6. నాతోపాటు హిందీ ఇంగ్లీషు సినిమాలకు రాకుండ, నీ నాయనమ్మ మనస్తత్వంతో తెలుగు సినిమాలకు వెళ్తూ నాకు తలనొప్పి తెప్పించటం.

ఇట్లు నీపై భర్త బాస్ సుబ్బారావు.

* * *

"శ్రీ సుబ్బారావుకు.
సంబోధన చూడగానే త్రుళ్ళిపడ్డాడు సుబ్బారావు. ఇంత అమర్యాదాగానా సంబోధన? ఉక్రోషంతో చదవసాగేడు.

"ఆడదాన్ని అడుగడుగునా అవమానించే మిమ్ముల నిలాపిలవటమే తగును. సహోద్యోగిని కనీసం 'గారూ' అని కూడ అనలేని మీ చెత్త ఛార్జిషీటు నా చంద్రకోల సంజాయిషీ చూడండి.

1. మిమ్ముల న్నేను భర్తగా ఆరువేలు పోసి కొనుక్కొని రెండేళ్ళయింది. కనుక మీరే నా క్రింది ఉద్యోగి. పైఉద్యోగి క్రింది వుద్యోగి పర్మిషన్‌తో యేపని చేయదనే ప్రాధమిక సత్యం మీకు తెలీక పోవటం మీఖర్మ. మీమీద హక్కు లున్నావి.

2. దుబారా పరులైన మిమ్ముల్ని దోవలో పెట్టటానికే మీవద్ద గుంజిన డబ్బు అప్పుకోరకు తమరు బిక్కమొహం వేసినప్పుడు మీకే యిచ్చానని గుర్తుచేస్తే ఎలావుంది సార్ మీ మొహం యిప్పుడు?

3. మిమ్ములను నేను ఖర్చుపెట్టి కొనుక్కోవటమే పెద్దదండగ. మళ్ళీ మీవాళ్ళ పెళ్ళిళ్ళకు ఖర్చు మరీ దండగ. మావాళ్ళపైన ఖర్చు పెడితే కొంతయినా రీయింబర్సు అవుతుందని నా భావం

4. ఆడదానికి తొందరగా తల్లినవ్వాలని తపన వుంటుందనే తెలివిలేకుండా, మీరు పని చేసే ఆఫీసులోని పనికిమాలిన శ్యాంపిల్సు అన్నీ నా మొహానపడేస్తుంటే మన సరసం విరసంకాక మరేమవుతుంది?

5. నెలలో మూడు సెలవులు నిర్బంధంగా వుండాలని ప్రకృతి ప్రభుత్వమే పడతికి వరం ప్రసాదించింది. దాన్నికాదంటే మీరు గూడ అవిధేయతకే గురవుతారు.

6. పొరుగింటి వుల్లికూర హిందీ, ఇంగ్లీషు సినిమాలుచూస్తూ, అందులో ఓనమాలు రాకపోయినా రేగుచెట్టు క్రింద గుడ్డాళ్ళైన మీబోటి ఫాల్స్‌ప్రెస్టేజిగాళ్ళ ఆటకట్టింపు నా తెలుగు సినిమాభిమానం. అదిగుణమేనని తెలుసుకోండి రావణుడుగారూ!

మీలాగాకాకుండా, నేను మిమ్మల్ని ఉద్యోగంలోంచి తొలగించిన వుత్తరవులు పంపుతున్నాను. మీ గోవులాంటి గోమతి.

సుచంద్ర మినీకథ

# చార్జిషీట్